www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 మే 2025

జులై నుంచి అర్హులందరికీ పెన్షన్లు

- రెండు నెలల్లో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం
- సత్యవేడు నియోజకవర్గ కార్యకర్తలతో నారా లోకేష్

ప్రజాశక్తి - సత్యవేడు

రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతున్న చంద్రబాబుకు అండగా నిలిచేందుకు కలసికట్టుగా పనిచేయాలని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. జులై నుంచి అర్హులందరికీ పెన్షన్లు అందిస్తామని, వచ్చే రెండు నెలల్లో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. శత్రువులపై పోరాటానికి ప్రధాని ఏ నిర్ణయం తీసుకున్నా అండగా నిలుస్తామని చెప్పారు. సత్యవేడు నియోజకవర్గటిడిపి కార్యకర్తలు, నేతలతో సంత ప్రాంగణంలో సమన్వయ సమావేశం రెండు రోజు గురువారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ శత్రువులపై పోరాటానికి ప్రధాని నరేంద్రమోదీ ఏ నిర్ణయం తీసుకున్నా అండగా నిలుస్తామన్నారు. పహల్గాంలోకి ప్రవేశించిన ఉగ్రవాదులు అమాయక ప్రజలను నిర్దాక్షణ్యంగా పొట్టన పెట్టుకున్నారు. మోదీ తీసుకునే ఏ నిర్ణయమైనా అండగా ఉంటామన్నారు. వంద పాకిస్తాన్‌లు వచ్చినా మన దగ్గర మిసైన్ ఉందని, ఆ మిసైల్ పేరే ప్రధాని నరేంద్ర మోదీ అని అన్నారు. భారతీయులను చంపిన వారిని వదిలిపెట్టకూడదనే లక్ష్యంతో పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సైనికులు మన కోసం పోరాడుతున్నారన్నారు. వైసిపి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్‌పత్రాలు చించేస్తుంటే వీరోచితంగా పోరాడిన అంజిరెడ్డి తాత తొడగొట్టి సవాల్ విసిరారని, ఆయనే తనకు స్ఫూర్తి అని, బూత్‌ల్లో రిగ్గింగ్ చేస్తుంటే అడ్డుకునేందుకు రక్తం చిందించిన మంజులారెడ్డి స్ఫూర్తి అని అన్నారు. కార్యకర్తలను కలిసిన తరువాతే రాష్ట్ర పార్టీ ముందుకు వెళు తోందన్నారు. నియోజకవర్గంలో ప్రత్యేక సమస్యలు ఉన్నాయని, కలిసి మాట్లాడుకుని సస్యలు పరిష్కరించుకుందా మన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జోన్ ఇంఛార్జ్ దీపక్ రెడ్డి, టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు జి.నరసింహ యాదవ్, పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, బాబు, నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీపతి బాబు పాల్గొన్నారు.

పింఛన్ ఇవ్వలేదని లోకేష్ దృష్టికి తీసుకొస్తున్న వికలాంగుడు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అభినందనలు

బంగారుపాళ్యం: తమ అద్భుత ప్రతిభతో లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన నలుగురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను నారా లోకేష్ అభినందించారు. సత్యవేడులో ఉదయం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు మంత్రి నారా లోకేష్ ను కలిశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన హేమ, పునీత్ సాయి, లహరి, రేవతి అనే విద్యార్థులు "పై (జూ) " వాల్యూను ఒక్కొక్కరు 1000 డెసిమెల్స్ ను చూడకుండా చెప్పి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కారు.

విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్

'ఫాసిజాన్ని' గడగడలాడించింది 'ఎర్రజెండా'

- 'ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తి' సభలో ఎంఎ బేబి
- తిరుపతి పురవీధుల్లో భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఎనభై ఏళ్ల క్రితం ప్రపంచం మొత్తాన్ని ఆక్రమించాలని ఫాసిజం ప్రయత్నిస్తే, రష్యా రక్షకుడు స్టాలిన్ నాయకత్వంలో 2 కోట్ల 60 లక్షల మంది తమ ప్రాణాలను త్యాగం చేసి ఫాసిజాన్ని గడగడలాడించింది ఎర్రజెండా' అని సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి అన్నారు. సిపిఎం 24వ మహాసభ దేశ సమైక్యత కోసం , ప్రజల హక్కుల కోసం పోరాడాలని తీర్మానించిందని, దేశ ప్రజలందర్నీ కుల, మతాలకు అతీతంగా ఒకతాటిపై నిలబెట్టాల్సిన బాధ్యత ఎర్రజెండాపై ఉందన్నారు. 'ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తి'కి చిహ్నంగా రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో తిరుపతి వేదికగా గురువారం సాయంత్రం కచ్చపి ఆడిటోరియంలో బహిరంగసభ జరిగింది. ఈ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షత వహించారు. ఎంఎ బేబి ఫాసిజంపై రష్యా వీరోచిత పోరాటాన్ని ఆంగ్లంలో వివరించారు.

పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ ఫాసిజం తొలుత కమ్యూనిస్టులను నాశనం చేయాలనుకుంటుందని, హిట్లరు పార్లమెంట్‌ను తగలబెట్టి ఆ నెపాన్ని కమ్యూనిస్టులపై రుద్ది వారిని జైలు పాలు చేశారని, అయినా బెదరకుండా పాసిజంకు వ్యతిరేకంగా ఎర్రసైన్యం ప్రాణాలొడ్డి ఎదుర్కొందన్నారు. వారి త్యాగఫలితమే ప్రపంచ శాంతి అని గుర్తు చేశారు.

సభలో మాట్లాడుతున్న పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ఇప్పుడు కూడా ఇదే పునారవృతం అవుతోందని, దేశంలో ప్రజాసంక్షేమం కరువైందన్నారు. లేబర్‌కోడ్ వంటి ప్రజా వ్యతిరేక చట్టాలను తెచ్చి ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నారని విమర్శించారు. దీన్ని ప్రతిఘటిస్తున్నది కూడా కమ్యూనిస్టులే అన్నారు. బిజెపి దేశంలో హిందువులు కానివారిని తరిమికొట్టాలని అంటుందని, ఉదారవాదం కూడా ఫాసిజంకు పనికిరాదన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పి4 విధానం ద్వారా పేదరిక నిర్మూలన చేస్తామని చెబుతున్నారని, కానీ ఇది వాస్తవదూరంగా ఉందన్నారు. అందుకు నిదర్శనం ఇటీవల మెగా కంపెనీ గుంటూరులో ఆరు కుటుంబాలను దత్తతకు తీసుకుందని, పోలవరం నిర్మాణం చేస్తున్న అదే కంపెనీ అక్కడ కార్మికులకు కనీసం వేతనాలు ఇవ్వడం లేదని, ఇలాంటి వారు పేదలను ఎలా ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న అభివృద్ధి మంత్రంపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండు చేశారు. కౌలు రైతులకు నష్ట పరిహారం లేదని, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏనుగుల దాడి నుంచి రక్షణ లేదని, ప్రజారక్షకుడని చెప్పుకుంటున్న పవన్‌కల్యాన్‌కు ఇవి పట్టవా అని ప్రశ్నించారు. అప్పటికి, ఇప్పటికి ఈ రాష్ట్రంలో సిపిఎం ఒకటే రాజకీయ ప్రత్యామ్నాయం అని అన్నారు. కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ బిజెపి అబద్దాలతోనే అధికారంలోకి వచ్చిందని, ప్రజలను ఊహాల్లో పెట్టి పరిపాలిస్తుందని ధ్వజమెత్తారు. ఉగ్రదాడిలో బాధితులు తమను కాపాడిని ముస్లీంలను కొనియాడితే వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా దుషించడం సరైనది కాదన్నారు. కులంతర వివాహం చేసుకుందని తిరుపతి జిల్లాలో ఓ తల్లి తన కూతుర్ని చంపి, పాతిపెట్టిందని, జిల్లా వాసైన సిఎం చంద్రబాబు కనీసం దాన్ని ఖండించకపోవడం దారుణమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతి అభివృద్ధికి టిటిడి నిధులను కేటాయిస్తుంటే అడుగడుగునా బిజెపి అడ్డుకుంటోందన్నారు. టిటిడిలో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అందడం లేదన్నారు. ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర కమిటి సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, జనార్ధన్, టి.సుబ్రమణ్యం, నాయకులు సాయిలక్ష్మీ, జయచంద్ర, ఆర్.లక్ష్మీ, వేణుగోపాల్, మాధవ్, హరినాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వి. నాగరాజు

బహిరంగ సభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు

రోడ్ డెవలప్మెంట్ ప్లాన్ విడుదల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు హై రోడ్డు విస్తరణలో భాగంగా గురువారం నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ వెంకుశ కళ్యాణ మండపం నుండి అండర్ రైల్వే బ్రిడ్జి వరకు 1.1 కిలోమీటర్ వరకు అండర్ రోడ్ డెవలప్మెంట్ ప్లాన్‌ను విడుదల చేశారు. ఈఆర్‌డి ప్లాన్‌కి సంబంధించి స్థల యజమానులు ఏవైనా సందేహాలు, సూచనలు ఉంటే నగరపాలిక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో 15 రోజుల లోపల సంప్రదించాలని కోరారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ,శుభప్రద, బిల్డింగ్ సూపర్వైజర్ బాలాజీ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.



రోడ్డు ప్లాన్‌ను విడుదల చేసిన కమిషనర్ ప్రసాద్

హైరిస్క్ కేసులు మాత్రమే రెఫర్ చేయాలి

డిఎం అండ్ హెచ్‌ఓ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి.సుధారాణి ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులకు జాతీయ కార్యక్రమాలపై జూమ్ కాన్ఫరెన్స్ రివ్యూ నిర్వహించారు. ఆర్‌బిఎస్‌కె స్క్రీనింగ్ చాలా తక్కువగా ఉన్న పీహెచ్సీలు వెంటనే పూర్తి చేసి హాట్ కాఫీ సబ్మిట్ చేయాలన్నారు. అర్హులైన దంపతుల జాబితాను అప్డేట్ చేసి వెంటనే పంపాలన్నారు. మాత శిశు మరణాలు రాకుండా ఉండాలంటే గర్భస్థ సమయం నుంచి అందించాల్సిన సేవలు తప్పక ఇస్తూ, హాస్పిటల్‌లో కాన్పులు, బయట కాన్పులు వెంటనే ఎస్ఎన్‌సియుకి రెఫర్ చేసి చికిత్స చేసినట్లయితే మరణాలు లేకుండా చూడొచ్చు అన్నారు. కారణాలను లోపాలను వెతికి రెక్టిఫై చేసి పిల్లల మరణాలను నివారించాలని అన్నారు. కాన్పులన్నీ తప్పనిసరిగా పిహెచ్సి, సిహెచ్సిలో చేయాలని, హైరిస్క్ కేసులు మాత్రం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేయాలన్నారు. సిజేరియన్ ఆపరేషన్ ద్వారా కాన్పులు చాలా తక్కువ ఉండాలని తెలిపారు. ఆర్‌సిహెచ్, ఐడి కి అభ ఐడి తప్పనిసరిగా 100శాతం లింక్ చేయాలని, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ఆప్స్‌లో వంద శాతం ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనూష, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ గిరి, డిఎంఓ వేణుగోపాల్, జయరాముడు, శ్రీవాణి, కేటి ప్రసాద్, రామ్మోహన్, పిహెచ్‌సి డాక్టర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సిహెచ్‌ఓల సమ్మెకు పెరుగుతున్న మద్దతు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సిహెచ్‌ఓల సమస్యలు వెంటనే పరిష్కరించియాలని గురువారం జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అనేక రకాల సేవలు అందిస్తున్న కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుమణన్నారు. వారు అడుగుతున్నది గొత్తెమ్మ కోర్కెలు కాదని న్యాయమైన సమస్యలు పరిష్కరించడానికి ఎన్ని రోజులు పడుతుందని అన్నారు. ఆర్థికపరమైన సమస్యలు అంటే భారం పడొచ్చు ఏమో కానీ ఇతర సమస్యలను పరిష్కారం చేయడానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. సక్రమంగా పనిచేయలేదని చెప్తున్నారే తప్ప నిజంగా వారి పని చేయ లేదా మరి ప్రజల్ని అడిగితే తెలియదా అని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిర్ధిష్టమైన పని కల్పించి, పని భారం తగ్గించాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వారు ఎన్ని రోజులు పోరాడిన అన్ని రోజులు సిఐటియు వారికి అండగా ఉంటూ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని లేనిపక్షంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పక్కాగా ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

హాజరుకానున్న 15,377 మంది విద్యార్థులు : డీఆర్‌ఓ మోహన్ కుమార్

అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 12 నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని డిఆర్‌ఓ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ఇంటర్మీడియట్ విద్య, రెవెన్యూ, పోలీస్, ఇతర సంబంధిత శాఖల అధికారులతో డిఆర్‌ఓ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో మే 12 నుండి జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను డిఈఓ, రెవెన్యూ, పోలీస్, ఏపిఎస్ ఆర్‌టిసి, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, పోస్టల్‌శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో పరీక్షలు నిర్వహించిన 35 పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పరీక్షా సమయాలలో జిరాక్స్ సెంటర్‌లను మూసివేయాలని, పోలీస్ వారి సమన్వయంతో ఇద్దరు డిప్యూటీ తహశీల్దార్‌లను ఫ్లైయింగ్ స్క్వాడ్‌లుగా నియమించాలని ఆదేశించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఉదయం 6 గంటల నుండి రవాణా సౌకర్యం కల్పించాలని ఏపిఎస్ ఆర్‌టిసి అధికారులను, అత్యవసర వైద్యసేవలకు నర్సులు, ఏఎన్ఎంలను నియమించాలని వైద్యశాఖ అధికారులను, పరీక్షా సమయంలో విద్యుత్తుకు అంతరాయం కలుగకుండా విద్యుత్ శాఖ చూసుకోవాలన్నారు. పరీక్షా పత్రాలను నిర్దేశిత పోస్ట్ ఆఫీసులకు చేర్చేలా పోస్టల్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొదటి సంవత్సరం పరీక్షా సమయం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండవ సంవత్సరం పరీక్షలు మధాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. జనరల్, ఒకేషనల్‌కు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు మే 28 నుండి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలలో 170 కళాశాలకు సంబంధించి జనరల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 10,236, రెండవ సంవత్సరం విద్యార్థులు 3,724 ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 810, రెండవ సంవత్సరం విద్యార్థులు 607 మొత్తం 15,377 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఆర్ఐఓ శ్రీనివాసులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్‌మెంట్, ఇండస్ట్రీస్‌తోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే

రూ.15.27 కోట్ల ఎంఎస్ఎం ఈ పార్కుకు శంకుస్థాపన

ప్రజాశక్తి- పలమనేరు

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగా నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రిన్యూర్) పార్కును ఏర్పాటు చేయడం జరుగుతుందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద రూ. 15.27కోట్లతో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, ఎంఎస్ఎంఈ పార్క్‌కు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు పెట్టుబడులు వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని భావించి ప్రతిఇంట్లో పారిశ్రామిక తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలను ఇచ్చి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలోనే పలమనేరు ప్రాంతం పరిశ్రమల స్థాపనకు అన్ని మంచి అనుకూలమైన ప్రాంతమని అన్నారు. మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న ఈ ప్రాంతానికి అన్ని విధాల రోడ్డు సౌకర్యంతో పాటు పోర్టు సౌకర్యం, ఎయిర్పోర్ట్ కనెక్టివిటీ ఉన్నందున పరిశ్రమల స్థాపనకు చాలా అనుకూలమని వివరించారు. భవిష్యత్తులో పలమనేరు ప్రాంతం మంచి ఇండస్ట్రియల్ క్యారీడారుగా కాబోతుందని కాబట్టి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్థానికులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. ముఖ్యంగా పెద్ద నగరాలైన చెన్నై, బెంగళూరులలోని పారిశ్రామికవేత్తలు రూరల్ ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూస్తున్నారని అలాంటి వారికి ఈ ప్రాంతం భవిష్యత్తులో చాలా అనుకూలంగా మారనుందన్నారు. ఈ మధ్యనే తిరువూరుకు చెందిన ప్రముఖ టెక్స్టైల్ కంపెనీ ఈ ప్రాంతంలో తమ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడాన్ని ఆయన గుర్తు చేశారు. కుప్పం, బైరెడ్డిపల్లి, వీ.కోట ప్రాంతాలు హార్టికల్చర్ పంటలకు అనుకూలం కావడం చేత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కాబట్టి ప్రభుత్వం సరళతరంగా ప్రోత్సాహాలనందిస్తూ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఇంటికో పారిశ్రామికవేత్తలుగా ఈ ప్రాంత వాసులు ముందుకు రావాలని కోరారు. పలమనేరు ఆర్‌డిఓ భవాని, తహశీల్దార్ ఇన్బనాథన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, డిఐసి జనరల్ మేనేజర్ సూరిబాబు, డిప్యూటీ జోనల్ మేనేజర్ భార్గవి, అసిస్టెంట్ మేనేజర్ ఇస్మాయిల్, ప్రాజెక్టు ఇంజినీర్ ప్రవీణ్, లైజనింగ్ ఆఫీసర్ లోకేష్, ఐపీవో రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ఓటరు జాబితా నుంచి

మరణించిన వారి పేర్లు తొలగింపుకు చర్యలు

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పారదర్శకమైన ఓటరు జాబితా తయారీ చేయడంలో భాగంగా మరణించిన వారి పేర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా సిద్ధం చేసేందుకు బిఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్ళేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎన్‌సిడి 3.0 సర్వే చేయడం జరుగుతున్నదని, తద్వారా ప్రతి కుటుంబంలోని వివరాలను సేకరించడం జరుగుతున్నదని, మరణించిన వారి వివరాలు కూడా వైద్య ఆరోగ్య శాఖ వద్ద ఉంటాయని, వారితో ఎలెక్షన్ సెల్ అధికారులు సమన్వయం చేసుకుని ప్రతి నియోజకవర్గంలో సచివాలయం వారీగా మరణించిన వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. మరణించిన, మల్టిపుల్ ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని టిడిపి ప్రతినిధి సురేంద్ర కుమార్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లను ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్లు నమోదైన వారికి కార్డుల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు కోరారు. ఒక నియోజకవర్గం నుండి మరొక నియోజకవర్గానికి ఓటర్ల జాబితాలో పేర్లను మార్పుకు సంబంధించి అంశాలను పరిశీలించాలని సిపిఎం ప్రతినిధి గంగరాజు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. వైసిపి ఉదయ్ కుమార్, ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రతినిధి బాల సుబ్రహ్మణ్యం, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ పరదేశి, జనసేన ప్రతినిధి యశ్వంత్, బిఎస్పి ప్రతినిధి భాస్కర్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్ పాల్గొన్నారు.

'ఫ్రైడే డ్రైడే' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఫ్రైడే డ్రైడే గోడపత్రికలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ సుధారాణి గురువారం ఆవిష్కరించారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించేటట్లు మానిటర్ చేయాలని తద్వారా లార్వాలను పూర్తిగా నివారించవచ్చు. ఫైలేరియా కిట్స్ వ్యాధిగ్రస్తులకు ఇచ్చి హైజిన్ ఎలా పాటించాలో వివరించాలన్నారు. అలాగే డిఈసి మందులను వేసుకునే పద్ధతిని తెలపాలన్నారు. హై రిస్క్ ప్రాంతాలను గుర్తించి రసాయనాలను స్ప్రే చేయించాలని దిశానిర్దేశం చేశారు. కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత కారణంగా మూతలేని నీటి నిల్వలతో డెంగీ కనిపిస్తున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, లార్వాలు ఉన్న అన్ని ఏరియాలలో స్ప్రేయింగ్ చేపట్టాలని తెలిపారు. ఎక్కడైనా పాజిటివ్ కేసు కనిపిస్తే ఆ చుట్టుపక్కల అన్ని ఇండ్లలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉగ్రవాదులు దాడులు జరిగినప్పుడు సమీపాన పౌరులు తమకు తాము ఏ విధంగా స్వీయ రక్షణ పొందాలి, ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి, రక్షణ దళాలు ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై చిత్తూరు జిల్లా పోలీసులు గురువారం పట్టణ రైల్వేస్టేషన్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. కేంద్ర హోంశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, హెల్త్, రైల్వే, జిఆర్‌పీ, ఐసీడీఎస్, ఇతర శాఖలు సమన్వయంతో ఈ మాక్ డ్రిల్‌ను నిర్వహించి ప్రయాణికులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. రైల్వే స్టేషను, ఇతర పబ్లిక్ ప్రదేశాలలో ఉగ్రవాద దాడులు వేళ అత్యవసర, ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, పౌరులు వెంటనే తీసుకోవలసిన జాగ్రత్తలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి, రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలి, అనే విషయాలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది వెంటనే చేపట్టే చర్యలు మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. ఉగ్రవాదులు దాడులుకు పాల్పడితే ఆ సమయంలో ఎలాంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలి, ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పించాలి, ప్రమాదం జరిగిన వెంటనే వారిని ఆంబులెన్స్ ద్వారా హాస్పిటల్‌కు ఎలా తరలించాలి, బాంబులు అమర్చిన ప్రాంతాన్ని బాంబు స్క్వాడ్ ద్వారా గుర్తించి వాటిని ఎలా డిస్పోజల్ చేయాలి, ఉగ్రవాదులను, శత్రవు మూకలని ఏ విధంగా హతమార్చాలని అంశాలను మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అడిషనల్ ఎస్పీ ఏ.ఆర్ శివానంద కిషోర్, చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర, రెండవ పట్టణ సీఐ నెట్టి కంటయ్య, ఆర్పిఎఫ్ సిఐ కుమార్, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో భద్రతా ప్రమాణాలపై దృష్టి : కలెక్టర్

- భద్రత ప్రమాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

మాక్ డ్రిల్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- యాదమరి: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలలో భద్రతా ప్రమాణాలపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో గురువారం యాదమరిలోని ఐఓసిఎల్‌లో భద్రతా ప్రమాణాలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి మణికంఠ చందోలుతో కలసి మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం చీఫ్ టెర్మినల్ అరుణ్ ప్రసాద్‌తో సమావేశమై భద్రతా చర్యలు, ఇన్సైడ్ యాక్సిస్ లిమిటేషన్లు, బయటి వ్యక్తుల అనుమతి నియంత్రణ, సిబ్బంది నైపుణ్యాభివృద్ధిపై సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐఓసిఎల్ టెర్మినల్ వద్ద పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాలన్నారు. ఊహించని ఘటనలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాల పై పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పైప్‌లైన్ సెక్యూరిటీ, నిర్వహణ, ఇంధనం స్టోరేజ్ ట్యాంకుల వద్ద భద్రత, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకుంటున్న చర్యలపై సమీక్షించి ముందస్తు జాగ్రతా చర్యలను తీసుకోవాలన్నారు. వాహనాల ప్రవేశ, నిర్గమ ద్వారాలను పరిశీలించాలని, కట్టుదిట్టమైన భద్రత ఉండాలన్నారు. అందుబాటులో ఉన్న వైద్యసేవలపై సమీక్షించి ఆధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐఓసిఎల్ వద్ద నైట్ డ్యూటీలో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, ఇతర ప్రాంతాల నుండి ఇంధనం నింపుకోవడానికి వచ్చే లారీలను పూర్తి స్థాయిలో తనిఖీ చేసే సమయంలో వాహనాల స్థితిని పరిశీలించి పంపాలన్నారు. అనుకోని సంఘటనలు జరిగినట్లైతే పూర్తి అప్రమత్తంగా ఉంటూ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ మాక్‌డ్రిల్ సమయంలో ఐఓసిఎల్‌లో ఉన్న స్టోరేజ్ పాయింట్ లాలలో ఉగ్రవాదుల దాడులను ఎదుర్కొనేందుకు ఎలా స్పందించాలో తెలిపారు. ఐఓసిఎల్ వంటి ఇంధన సంస్థలు ఉగ్రదాడులకు ప్రధాన లక్ష్యాలుగా మారే అవకాశాలు ఉండడంతో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. భద్రతకు సంబంధించి మానవ వనరుల వివరాలు, వాటి విధులు అప్రమత్తతా స్థాయిలను అధ్యయనం చేశారు. పారిశ్రామిక సంస్థలు తమంతట అవే భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కలిసి పని చేస్తుందని హామీ ఇచ్చారు. ఐఓసిఎల్ టెర్మినల్ చీఫ్ వివరిస్తూ చెన్నై నుండి అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా ఇంధనం సరఫరా జరుగుతుందని, 2013 నుండి టెర్మినల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని, రాత్రి సమయంలో టెర్మినల్ కార్యకలాపాలు ఉండవని జిల్లా కలెక్టర్, ఎస్పీకి వివరించారు. ఐఓసిఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ, అడిషనల్ ఎస్పి రాజశేఖర్ రాజు, తహశీల్దార్ పార్థసారథి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి- చౌడేపల్లి: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ అగ్రహారంకు చెందిన లోకేష్ (26) అప్పులు చేసి తీర్చ లేక మనస్తాపానికి గురై గ్రామానికి సమీపంలోని తన టమోటా తోట వద్ద గల చింత చెట్టుకు ఉరేసుకుని మరనించారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి హేమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

- తప్పిన పెను ప్రమాదం - బాలుడికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల -తిరుపతి మార్గంలోని పాత మద్యం దుకాణం వద్ద సోమల నుంచి సదుం వైపు వెళుతున్న కారు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం ఉదయం 12 గంటల ప్రాంతంలో వికోట నుండి పురుషోత్తం తన భార్య కుమార్తె, కుమారుడితో కలిసి భాకరాపేటకు వెళ్తుతుండగా సోమల సమీపంలోని పాత మద్యం దుకాణం వద్ద చిన్నపాటి కునుకు తీయడంతో కారు అదుపు తప్పి ఎడమవైపున రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా కారులో ప్రయాణిస్తున్న పురుషోత్తం కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరిని వెంటనే సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యసేవలు అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

డిటోనేటర్ పేలి బాలుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- యాదమరి: డిటోనేటర్ పేలడంతో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యాదమరి మండలం బోటివారిపల్లి గ్రామపంచాయతీ కొత్తూరు ఏఎఫ్‌డబ్ల్యూ గ్రామానికి చెందిన టి.లోహిత్ (9) 4వ తరగతి చదువుతున్నాడు. లోహిత్ వాళ్ల అమ్మతోపాటు బుధవారం మేకలు మేపడానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో అక్కడ అశోక్ అనే వ్యక్తి అగ్రికల్చర్ ల్యాండ్‌లో ఆడుకుంటూ అక్కడ ఒక డిటోనేటర్‌కి ఉన్న కేబుల్ వైరును ఆడుకునే వస్తువు అని తన చేతులతో బలంగా లాగాడు. దీంతో ఒక్కసారిగా డిటోనేటర్ పేలి ఎడమ చేతికి తీవ్రగాయాలు అయ్యాయి. పక్కనే ఉన్న కుటుంబ సభ్యులకు తెలియజేసి హుటాహుటిన ఆసుపత్రి తరలించి చికిత్స అందించారు. అనంతరం యాదమరి పోలీసులు కేసు నమోదు చేసి గురువారం పేలుడు జరిగిన సంఘటన స్థలాన్ని ఎస్సై ఈశ్వర్ యాదవ్, బాంబ్ డిస్పోజల్స్ స్క్వాడ్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పోలీసులు పరిశీలించారు.

పది టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి- యాదమరి: పది టన్నుల రేషన్ బియ్యం ఒక క్వాలిస్ వాహనం స్వాధీనం చేసుకున్నట్టు సబ్ ఇన్స్పెక్టర్ ఈశ్వర్ యాదవ్ తెలిపారు. గురువారం మండలం తహశీల్దార్‌కు వచ్చిన సమాచారం మేరకు.. పుల్లయ్యగారిపల్లి గ్రామంలో పురుషోత్తం నాయుడుకి సంబంధించిన ఖాళీ గోడౌన్‌కు పలమనేరుకు చెందిన చంగల్ రాయులు, అబ్దుల్ సలాం అనే ఇద్దరు వ్యక్తులు తాము మొక్కజొన్నల వ్యాపారం చేస్తామని, గ్రామంలోని ఖాళీగా ఉన్న గోడౌను రూ.3000లు అద్దెకు తీసుకున్నారు. అందులో కర్ణాటకకు చెందిన రోషన్, ప్రదీప్‌లు అక్రమ పది టన్నుల పిడిఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచి అక్కడి నుండి అక్రమ రవాణా చేయడానికి సిద్ధమయ్యారు. ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి సుమారు 10,800కేజీల పిడిఎస్ రైస్, ఒక క్వాలిస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే బియ్యంను అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బుడిగిపెంటను సందర్శించిన డాక్టర్ మౌనిక

ప్రజాశక్తి- యాదమరి: వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ డాక్టర్ మౌనిక గురువారం బుడిగిపెంట గ్రామాన్ని సందర్శించారు. రెండు నెలల క్రితం బుడిగిపెంట గ్రామంలో విజయ్ దీప్ అనే 14 సంవత్సరాల బాలుడికి పలు రకాల రుగ్మతలు రావడంతో చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం బాలుడికి సంబంధించిన నివేదికలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డబ్ల్యూహెచ్ఓకు పంపడంతో ఆ బాలుని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించేందుకు డాక్టర్ మౌనిక గురువారం యాదమరి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఇక్కడ నివేదికలను పరిశీలించారు. జయదేవ్‌కి ఎలాంటి సమస్య లేదని, చిన్న సైడ్ ఎఫెక్ట్ వల్ల అతను కొంత కాలం శరీర రుగ్మతలతో ఇబ్బంది పడ్డారు తప్ప ఇంకెలాంటి సమస్య లేదని డబ్ల్యూహెచ్ఓ డాక్టర్ మౌనిక నిర్ధారించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, హెల్త్ వర్కర్ సురేందర్ రెడ్డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా ఎస్ఆర్ పురం మండలం, ఎస్ ఎస్ ఆర్ పురం గ్రామం నందు వినాయకస్వామి ఆలయం కలదు. ఈ దేవాలయమును దేవాదాయ శాఖ నందు సెక్షన్ 43 క్రింద రిజిస్టర్ చేయదలచినాము. ఇందుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నయెడల సహాయ కమిషనర్ దేవాదాయ శాఖ చిత్తూరు వారికి 15 రోజులలో విన్నవించుకోవాల్సిందిగా కోరుతున్నాము.

ఆలయ కమిటీ
ఎస్.ఎస్.ఆర్ పురం
ఎస్.ఆర్.పురం మండలం

దివ్యాంగ అభ్యర్థులకు ఆన్లైన్ ద్వారా

ఉచిత డీఎస్సీ కోచింగ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దివ్యాంగ అభ్యర్థులకు ఆన్లైన్ ద్వారా ఉచితంగా డీఎస్సీ కోచింగ్ అందించనున్నట్లు గురువారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏవై.శ్రీనివాస్ ఓ ప్రకటలో తెలిపారు. ఈనెల 11వ తేదీ లోగా ఎండిఎఫ్‌సి.ఏపిఆఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీసం 40 శాతం వైకల్యం ఉన్న అంధులు, బధిరులు, శారీరక వికలాంగులు దరఖాస్తు చేసుకొనుటకు అర్హులని తెలిపారు.

బోయకొండ గంగమ్మకు

హుండీ ద్వారా రూ 63.89 లక్షలు

ప్రజాశక్తి- చౌడేపల్లి: బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ.63,89,617లు ఆదాయం సమకూరినట్లు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం తెలియజేశారు. ఆలయంలో గురువారం 42 రోజులకు గాను లెక్కింపు నిర్వహించగా రూ.63,89,617లు నగదుతో పాటు 39.250 గ్రాముల బంగారం, 470 గ్రాముల వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు అమ్మవారికి కానుకలుగా సమర్పించారని తెలిపారు. అదేవిధంగా రణభేరి గంగమ్మ దేవస్థానం నుండి ఆదాయం రూ40,463లు ఆదాయంగా సమకూరిందన్నారు. మదనపల్లి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శశికుమార్, చౌడేపల్లి పోలీసులు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

కొత్త రైస్ కార్డు కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి- సోమల: మండలంలో రైస్ కార్డు లేని అర్హులైన వారు నూతన రైస్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అని సోమల తహశీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నూతన రైస్ కార్డుల జారీ కోసం ప్రభుత్వం మార్గదర్శకాలను ఆదేశించిందని, మండలంలోని సచివాలయాల్లో నూతన రైస్ కార్డు కోసం అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. అలాగే కార్డులో విభజన, చేర్పులు, మార్పులు, చిరునామా మార్చుకోవడం, మరణించిన వారి పేర్లను తొలగించడం ఇలా ఆరు రకాల సేవలను ప్రభుత్వం ప్రారంభించిందని వీటిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫామ్‌తో పాటు ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, వివరాలు తప్పనిసరిగా కచ్చితమైన సమాచారంతో పొందుపరిస్తే ప్రభుత్వం పరిశీలించి నూతన కార్డులను అందజేస్తుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సచివాలయాలలోని వీఆర్వోలను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలో రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, విభజన, కొత్త రేషన్ కార్డు కావల్సిన వారు వెంటనే పంచాయతీ పరిధిలోని సచివాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని మండల తహశీల్దార్ ప్రసన్న కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అన్నదాత సుఖీభవ'కి రిజిస్టర్ చేసుకోండి

వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్

ప్రజాశక్తి- సోమల: అన్నదాత సుఖీభవ పథకానికి మండలంలోని అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పియం కిసాన్ పథకం కింద ప్రతి రైతుకు రూ.20,000లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, మండలంలోని ప్రతి రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకుని వారి పరిధిలోని రైతుసేవా కేంద్రానికి వెళ్లి వివరాలను రైతుసేవా కేంద్రం అధికారి దగ్గర వెరిఫై చేయించుకుని రిజిష్టర్ చేయించుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం ఈ నెలాఖరు లోపే అన్నదాత సుఖీభవ పథకం నగదును రైతుల ఖాతాల్లోకి జమ చేస్తుందని, కాబట్టి రైతులు ఈ నెలాఖరు లోపు ఈ పథకానికి రిజిష్టర్ చేసుకోవాలని తెలిపారు. అనుమానాలు సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని అడిగి తెలుసుకుని తద్వారా వారు సూచించిన విధంగా పత్రాలను సమర్పించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వ్యవసాయ అధికారికి తెలియజేయాలని కోరారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి- సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని పలువురు మహిళలకు తడి, పొడి చెత్త ఏవిధంగా వేరు చేయాలి, తదితర విషయాలను పంచాయతీ కార్యదర్శి జయశంకర్, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి మహిళలు తడి, పొడి చెత్త ఏ విధంగా వేరు చేయాలి, హానికరమైన చెత్తను ఎలా వేరు చేసి చెత్తసేకరణ వాహనాలకు కు అందించాలని కోరారు.

తాగునీటిని పరీక్షించిన డివిజన్ అధికారి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న మంచినీటి సరఫరాలో నాణ్యతను ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్టాలిన్ గురువారం పరిశీలించారు. మండలంలోని చలమంగళం పంచాయతీ చిన్నేపల్లి గ్రామంలో తాగునీటి నమూనా నీటి పరీక్షల నిమిత్తం నీటిని సేకరించి ల్యాబ్‌లో పరీక్ష చేస్తామని అన్నారు. వారి వెంట ఎంపీడీవో బాలాజీ, ల్యాబ్ అసిస్టెంట్ కెమిస్ట్ మనికంఠ, పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్ రెడ్డి ఉన్నారు.

జగన్‌ను కలిసిన జ్ఞానజగదీష్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మాజీ సిఎం, వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డితో పాటు వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మొదలియార్ విభాగం అధ్యక్షుడు జ్ఞాన జగదీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో 25 వేల మందితో కలిసి బీసీ సభ ఏర్పాటు గురించి జగనకు తెలియచేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. గతంలో ఓసీ సామాజిక వర్గంలో ఉన్న మొదలియార్లను వైఎస్ఆర్ హయంలో బీసీగా మార్చారని దీంతో లక్షల మంది మొదలియార్ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించారన్నారని తెలిపారు.

జోరుగా పారిశుధ్యం పనులు

ప్రజాశక్తి- సోమల

మండల కేంద్రమైన సోమలలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా జరిగాయి. పంచాయతీ కార్మికులు ప్రతి వీధి తిరుగుతూ చెత్తను సేకరించి రోడ్డు పక్కనున్న పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రజలు కూడా పారిశుధ్యం పట్ల శ్రద్ధ వహించి పంచాయతీ వారికి సహకరించాలని ఆనంద్ కోరారు.

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరుకు ఎంతో ముఖ్యమైన పుంగమ్మ చెరువు నేడు ఆక్రమణలకు గురి అవుతోందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాపాడాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం అయన విలేకర్ల మాట్లాడుతూ 3717 మీటర్ల పొడువు, 400 ఎకరాల ఆయకట్టు, 335 ఎకరాల నీటి నిలువ కలిగి రైతులకు ప్రజలకు నీటిని అందిస్తున్న పుంగమ్మచెరువు నేడు కొద్దికొద్దిగా ఆక్రమణలకు గురి అవుతోందని ఆరోపించారు. దీని వల్ల రాబోయే కాలంలో నీటి సమస్యలు వస్తాయని దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. ఈవిషయాన్ని పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెరువు ఆక్రమణలను తొలగించి చెరువును శుభ్రం చేయాలని, లేకుంటే చెరువు కట్ట పైన నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రెడ్ క్రాస్ చిత్తూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డ్యూనాంట్ పుట్టినరోజు పురస్కరించుకొని ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, తల సేమియా (జన్యు పరమైన వ్యాధి) దినోత్సవంను పలమనేరు రోడ్డులోని రెడ్ క్రాస్ భవనంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు జీన్‌హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు వ్యాసరచన, చిత్రలేఖంలో ఉత్తమ విజేతలుగా ఎన్నికైన విద్యార్థులను అభినందించారు. ఆర్ఎస్.పూర్ణ చైతన్య మెమోరియల్ ట్రస్టు సౌజన్యంతో పట్టణంలోని నిరాశ్రయులకు అల్పాహారం అందించారు. రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ గోవర్ధన్ బాబి, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, సభ్యులు మోహన్ కుమార్, సెట్విన్ సీఈఓ తిరుపతి ఎంఆర్ అరుణ కుమారి, రెడ్ క్రాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల కుంభకోణంపై విచారణ జరపాలి

తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి- సోమల

రాష్ట్ర ఖజానాను, బీసీ నిధులను కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉందని, కూటమి ప్రభుత్వం చేస్తున్న కుంభకోణంపై పూర్తి విచారణ చేసి అక్రమాలు బహిర్గతం చేయాలని తహశీల్దార్ బెన్నురాజ్‌కు వైసిపి స్టేట్ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, బీసీ సెల్ పుంగనూరు అధ్యక్షులు లక్ష్మీపతి రెడ్డి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న ఆంధ్రప్రదేశ్లోని లక్ష మంది బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ, శిక్షణ ఇచ్చే కార్యక్రమంను అడ్డం పెట్టుకుని బీసీలకు కేటాయించిన నిధుల నుండి దాదాపు రూ.257 కోట్లు బీసీ మహిళలకు కుట్టు మిషన్లు పథకం ద్వారా దాదాపు రూ.167 కోట్లు బీసీల నిధులను దోపిడీదారులకు చేరేలా ఈ పథకం రూపొందించారని ఆరోపించారు. ఈ స్కీమ్ అంచనాలను అమాంతం పెంచేసి తక్కువ కోట్ చేసిన సంస్థను కాదని ఎక్కువ కోట్ చేసి సిండికేట్‌గా మారిన రెండు కంపెనీలకు పెద్ద పీటవేసి మొబిలైజేషన్ అడ్వాన్స్ పంచుకునే ఎత్తుగడలు, అరకొరగా శిక్షణా కేంద్రాలు, మహిళలకు కుట్టు మిషన్లు, శిక్షణలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు చూపుతున్న వైనం వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. వీటిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు.

మండలంలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి- వెదురుకుప్పం

మండలంలోని పలు పంచాయతీల్లో మోస్తారు వాన కురిసింది. గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వాన కురిసింది. మండలంలో పలు గ్రామాలలో వరి పంట కోత సమయం కావడంతో, రైతులు వరి పంటను యంత్రాల సహాయంతో నూర్పిడి చేస్తున్న సమయంలో వర్షం పడటంతో ఇబ్బందులు పడ్డారు.

టైలరింగ్ శిక్షణను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: స్థానికంగా మనకున్న అవకాశాలను అంది పుచ్చుకుని మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మహిళా సాధికారత లో ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాథమిక టైలరింగ్ శిక్షణను పట్టణంలోని ఐకెపి కార్యాలయంలో ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకం యొక్క ఉద్దేశాన్ని డిఆర్డిఏ పిడి శ్రీదేవి మహిళలకు వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగకరమైందన్నారు. ప్రాథమిక టైలరింగ్ శిక్షణ ద్వారా మహిళలకు కుట్టు మరియు డిజైన్ నైపుణ్యాల అందించడంతో వారికి ఆర్థిక మరియు మహిళా సాధికారత కల్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ ద్వారా ఆర్థిక స్వావలంబనతో పాటు తక్కువ పెట్టుబడితో జీవనోపాధి అవకాశాలు, గ్రామీణ మరియు పట్టణ పేద మహిళలకు ఆదాయ మార్గంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో టెక్స్ టైల్ పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద కంపెనీలు ముందుకు వస్తున్నాయని దీంతో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. కాబట్టి ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణ రెడ్డి, ఎంపీడీఓ ఖాదర్ భాషా, బాలాజీ కోపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, నాయకులు నాగరాజు రెడ్డి, అర్బీసి కుట్టి, గిరిబాబు, ఖాజా, నాగరాజు,మదన్, కిరణ్, బీఆర్సీ కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రైతులు ఆయిల్ పామ్ తోటల్లో తక్కువ పెట్టుబడితో సస్యరక్షణ పద్ధతిలో సాగు చేసి అధిక దిగుబడులు లాభాలు పొందాలని జిల్లా ఉద్యానమన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మండల ఎంపీడీవో కార్యాలయ హాలులో గురువారం నిర్వహించిన ఆయిల్ ఫామ్ రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగులో పంట వేసిన నాలుగు సంవత్సరాలకే లాభాల బాట పడతారని, అంతవరకు అంతర పంటలతో రైతులు దిగుబడులు చేసుకోవచ్చని సస్యరక్షణ పద్ధతిలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఆయిల్ ఫామ్ అన్ని రకాల నేలలలో సాగు చేసుకోవచ్చని, రైతులకు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, అగ్రికల్చర్వా భని, మండల ఉద్యాన అధికారి లోకేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ సిబ్బంది రైతులు అధికారులు పాల్గొన్నారు.

వైసిపి నేతల అవినీతి చర్చించకూడదనే

సర్వసభ్య సమావేశం వాయిదా..

టీడీపీ ప్రజాప్రతినిధులు ఆరోపణ



ప్రజాశక్తి-పెద్దపంజాణి: వైసిపి ప్రభుత్వంలో మండల నాయకులు చేసిన అవినీతిని ప్రశ్నింస్తామని మండల సర్వసభ్య సమావేశం జరగకుండా అడ్డుకుంటా ఉన్నారని లింగాపురం సర్పంచ్ రుద్ర మూర్తి నాయుడు, వీరప్పల్లి సర్పంచ్ భర్త వెంకటప్ప, వీరప్పల్లి ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం ఆరోపించారు. బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం గురువారం వాయిదా పడడంతో ఫోరం సభ్యులు లేక సమావేశం నిర్వహించలేదు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కార్యాలయం ఎదుట లింగాపురం సర్పంచ్ రుద్ర మూర్తి నాయుడు, వీరప్పల్లి సర్పంచ్ భర్త వెంకటప్ప, వీరప్పల్లి ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, సమావేశం వాయిదా వేయడాన్ని నిరసించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు చేసిన అవినీతి బయటపడుతుందనే ఉద్దేశంతో నేడు మండల ఎంపీటీసీలను సర్పంచులను మండల వైసిపి నాయకులు మభ్యపెడుతున్నారన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే సమావేశంలో చర్చించాలే గానీ ఇలా వాయిదాలు వేయడం సరికాదన్నారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమాలు ఓర్వలేక ఇలాంటి సమావేశాలు వాయిదా వేయడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో కొంతమంది నాయకులు అధికారుల అండతో వీరప్పల్లి పంచాయతీ సుద్దగుండ్లపల్లి రెవెన్యూలో జడ్పిటిసి సభ్యురాలు సుష్మ కీర్తి సర్వేనెంబర్ 159/4లో 2.72 సెంట్లు అనువంశికమని రికార్డుల్లో ఉందని, అయితే జడ్పిటిసి సభ్యురాలు ఎక్కడ పుట్టారు, వారి పూర్వీకులు వీరప్పల్లి పంచాయతీలో ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా గత ప్రభుత్వంలో అవినీతి వారి బాగోతం బయటపడుతుందనే భయంతో ఈరోజు ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న సాధారణ సర్వసభ్య సమావేశాలు వాయిదా వేయడం సరికాదన్నారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

కార్వేటినగరంలో..

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి, ఆర్కేవిబి పేట, ఎంఎం విలాసం, కత్తెరపల్లి రైతు భరోసా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారిని హేమలత స్కిల్ ఆఫ్ చిత్తూరు- డిజిటల్ ట్రైనింగ్‌పై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రైతులు స్మార్ట్‌ఫోన్ ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్లో వలన కలిగే లాభాలు వాటి నష్టాలను గురించి వివరించారు. ఫోన్ పే, గూగుల్ వంటి యాప్లను, యూట్యూబ్ వంటి వ్యవసాయ యాప్ల వినియోగం ద్వారా వ్యవసాయం చేసే విధానాలపై అవగాహన కల్పించారు. ఏవోలు హేమాద్రి, గాయత్రి రైతులు పాల్గొన్నారు.

చౌడేపల్లి : రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని దుర్గసముద్రం రైతు సేవా కేంద్రలో మండల వ్యవసాయ అధికారి జ్యోతమ్మ, మాస్టర్ ట్రైనర్ నవీన్ తెలిపారు. గురువారం రైతుసేవా కేంద్రంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు- డిజిటల్ ట్రైనింగ్‌పై రైతులకు శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు స్మార్ట్ ఫోన్ ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్ల వలన కలిగే లాభాలు, వాటి నష్టాలను తెలియజేశారు. ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్లను వ్యవసాయ, అగ్రిసెంట్రల్, ప్లాంటిక్స్, ఎన్పీఎస్ఎస్, మార్కెటింగ్ యాప్, యుట్యూబ్ వంటి వ్యవసాయ యాప్‌ల వినియోగం ద్వారా వ్యవసాయం చేయు విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయ పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి 30 మంది రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో ఉన్నవారు 10 మంది రైతులకు శిక్షణ ఇచ్చినట్లయితే వారికి టాప్ త్రీలోని ముగ్గురికి శిక్షక రైతులకు బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతిగా రూ.12 వేలు, మూడవ బహుమతిగా రూ.8 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందించి, సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి జ్యోతమ్మ పాల్గొన్నారు.

తవణంపల్లి: మండలంలోని వెంగంపల్లి గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో రైతు స్కిల్ అప్ డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి జి ప్రవీణ్, వ్యవసాయ విస్తరణ అధికారి లేష్మా, వెంగంపల్లె రైతు సేవ అధికారి జి.దీపిక నిర్వహించారు. రైతులకు డిజిటల్ వ్యవసాయ సాధనాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో గ్రామంలోని సుమారు 75 మంది రైతులు పాల్గొని డిజిటల్ వ్యవసాయం దాని లాభనష్టాల గురించి తెలుసుకున్నారు.